# ఉరి

('ఆనందవాణి' వారపత్రిక, 17-12-1950 సంచిక)

**నా**కు మీరు ఉరిశిక్ష వేశారు. నన్ను చెప్పుకునేది చెప్పుకోమన్నారు. శిక్ష వేయకముందు చెప్పుకోమంటే అర్థం ఉండేది. ఇప్పుడు చెప్పుకొన్నా ఒకటే. చెప్పుకొనకపోయినా ఒకటే. కాని మీరిప్పుడు చెప్పుకోమనటంలో ఒక విశేషం ఉంది. ఎట్లాగూ చస్తున్నాడు కదా, చచ్చిం తర్వాత మాట్లాడేది లేదు, పెట్టేదిలేదు. ఆ మాట్లాడేది కాస్తా యిప్పుడే మాట్లాడమని, మనుష్యుడై జన్మ యెత్తిన తర్వాత మాట్లాడటంలో కొంత లౌకికమైన సంతోషం ఉంటుంది. అది మాయాపిహితులైన మానవులకు సహజలక్షణం. మీకు నా శరీరం మీద ప్రేమలేదు. నా ఆత్మమీద ప్రేమ. నా ఆత్మ మీ ఆత్మలు అందరివి ఒకటే గనుక. అయినా కాకపోయినా మీరనుకొంటున్నాను గనుక యిది ఒక మామూలు.

ఇప్పుడు నేను మాట్లాడకపోతే నష్టం లేదు. మాట్లాడితే వచ్చే లాభం లేదు. కాని నేను మాట్లాడితే లాభం ఉంటుందని కొందరనుకొంటారు. వాళ్ళ ఉద్దేశంలో మాట్లాడవలసిందే. ఏమైనా సరే మాట్లాడవలసిందే. బ్రతికియున్నంత వరకు ప్రయత్నం చేయవలసిందే. బ్రతికియున్నంత మందీ ప్రయత్నం చేయవలసిందే వాళ్ళు. మీ కన్న మాయాపిహితులు.

నేను మనిషిని చంపానని మీరు నాకు ఉరిశిక్ష వేశారు. ఆ చంపానన్నది నాకు తెలియదు. మీకూ తెలియదు. చంపానని సాక్ష్యం యిచ్చినవాళ్లకీ తెలియదు. నాకు తల్లీ పెళ్ళాం బిడ్డలు ఉన్నారు. వాళ్ళను పోషించలేక నేను చాలా బాధపడ్డా. వాళ్ళకు తిండిలేదు. నాకూ తిండిలేదు. మీ దయవల్ల రెండు నెలలనుండి ఖైదులో కూర్చొని అన్నం మాత్రం తిన్నాను. ఈ రెండు నెలలు వాళ్ళేమైనారో నాకు తెలియదు. ఈ పాటికి వాళ్లూ చచ్చేవుంటారు. వాళ్ళ కన్న నేనే అదృష్టవంతుణ్ణి. వాళ్ళు చావకముందు మాడి మాడి చచ్చివుంటారు. నేను చచ్చేముందు ఏదో యింత అన్నం తినే చస్తున్నా.

నేను ఉద్యోగం చేయలేదు. కూలీ నాలీ కుదరలేదు. మోసం చేయలేను. ఎక్కడో నాల్గురాళ్ళు సంపాదిస్తే దాంతో బియ్యం కొనుక్కుందామంటే

బియ్యం దొరకలేదు. అదివరకు నాల్గురోజులు ఇంటిల్లిపాతికా పస్తున్నాం. నేను నా భార్య ఎల్లాగో అల్లాగా తమాయించుకొన్నాం. పిల్లలు బక్క నరాలై కూర్చున్న చోటునుంచి లేవలేక యేడ్చే శక్తి గూడా లేక బ్రతికియున్న శవాలల్లే పడి ఉంటే చూడటం యెలాగా?

బియ్యం అమ్మే దుకాణం పెద్దపులల్లే ఇరవై గజాల తోక పెంచుకొని ఆ తోక చివ్వర నేను. నాలుగురోజులు, ఈ తోక చివరితనం పొందలేక విసిగి చివరికి యింటికి వచ్చాను. ఒక ముసలిది నామీద దయపుట్టి తనకు వచ్చిన బియ్యంలో సగం నాకు రెట్టింపు ధరకు అమ్మింది. ఆ బియ్యం తీసుకొని వచ్చి వండి పిల్లలకు పెడ్దామంటే అవి గొడ్లు తినాలి గాని మనుష్యులు తినరు. నాలుగు పోట్లు వేసి చెరిగితేగాని వండటానికి పనికిరావు. దంచాలి అంటే నాలుగు రోజులు తిండిలేని మా యింటిదానికి ఓపిక లేదు. నాకూ లేదు. అయినా పిల్లల స్థితి చూడలేక మా యింటిది ఆ బియ్యం చిరిగిన చీరకొంగున కట్టుకొని పది కొంపలు తిరిగింది. ఒకళ్ళు విసిరి కొట్టారు. మరి ఒకళ్ళు వాళ్ళ యింట్లో నోమట. అట్లు కోసం పిండి దంచుకొంటున్నారు. అన్ని యిళ్ళు యిట్లాగే అయినవి. చివరకా బియ్యమే ప్రొయ్యి రాళ్ళ మీద పెట్టింది మాయింటిది. ప్రొయ్యిక్రింద మంటలేదు. ఒకాయన దొడ్డిచుట్టూ కంచె వేశాడు. ఆ కంచె గాడిదలూ, కుక్కలూ,పందులూ విరగతొక్కినవి. కంచె పుల్లలు ఇటూ అటూ పడి ఉన్నవి. అవి యెవరికీ పనికిరావు. అవి నేను ఏరితెస్తూంటే ఆ ఒకయాన "ఎవడి అమ్మా మొగుడి సొమ్మనుకున్నావు" అని వచ్చి నన్ను కఱ్ఱతో విరగగొట్టాడు.

ఇంటికి వచ్చాను. ఇల్లంటే నవ్వు వస్తోంది. ఎవళ్ళదో పడిపోయిన గోడ ఉంటే ఆ స్థలంలో యెవళ్ళూ కాపరానికి లేరు. ఆ గోడక్రింద ఉంటున్నాం. అదే యిల్లు. పైన పుల్లాపుడకా పెట్టి తలలు మాత్రం దాని క్రిందపెట్టి నిద్రపోయేటట్లుగా మా యింటిది ఆధారం చేసింది. నేను వెళ్ళేటప్పటికి ఆ ఆధారం తీసి దానితో మంటవేస్తోంది. ఈ ఆధారం ఎక్కువా? పిల్లల కడుపు మంట ఎక్కువా?

మరునాడు మా పిల్లలస్థితి చూడగా కడుపులో నొప్పితో మెలితిరిగి పోయినారు. నాలుగు వాము పరకలు తెద్దామంటే చేతిలో ఉన్న నాలుగణాలు నిన్నటి ముసలమ్మే కాజేసింది. మళ్ళీ తర్వాత నాలుగురోజుల వరకు బియ్యంలేవు.

పిల్లల కడుపునొప్పులూ తగ్గలేదు. మా యింటిది లేవనే లేకపోయింది. నేనట్టాగే తిరుగుతున్నాను.

ఆ రోజున మధ్యాహ్నం జనం గుంపులుగా వెళ్ళుతున్నారు. నేను వాళ్లెక్కడికి వెళుతున్నారని అడిగాను. అందరికీ బియ్యం ఇస్తారట అని చెప్పారు. నేను వాళ్ళ వెంట వెళ్ళాను. వాళ్ళు వందా రెండు వందలమంది ఉన్నారు. జనం ఒకచోటికి వెళ్ళారు. జనం కేకలూ బొబ్బలూ నానా హంగామాగా ఉంది. ఒక యింటి దగ్గర ఆగారు. ముందర యేమి జరుగుతోంది నాకు తెలియదు. నేను వెనక ఉన్నాను. బియ్యం కోసం త్రొక్కిళ్ళాడుతున్నారనుకొన్నాను. చుట్టుప్రక్కల యిళ్ళవాళ్ళందరూ కొందరు తలుపులు వేసికొన్న వాళ్ళూ, కొందరు తొంగిచూచే వాళ్ళుగా కన్పించారు.

కొంతసేపటికి రక్షకభటులు వచ్చారు. నేననుకొన్నా గదా "అమ్మయ్యా! వీళ్ళు వచ్చారు గదా! అందరికీ సరిగ్గా పంచిపెట్టేస్తారు. అని. క్రమక్రమంగా నాకు తెలిసింది. ఆ గుంపుకీ ఆ రక్షకభటులికి దెబ్బలాట జరగుతోందని.

ఇంతలో రక్షకభటులు తుపాకులు కాల్చారు. ఈ గుంపులోంచి రక్షకభటుల మీద రాళ్ళు విసరుతున్నారు.

వ్యవహారం యెప్పుడైతే ముదిరిందో నాకెందుకురా బాబూ ఇది పోదామనుకొన్నాను. కాని పోవటమెట్లా? అదివరకు నెల్లాళ్ళ మట్టి తిండేలేదు. వారానికొకసారి యేదో తినీతిననట్లు తిన్నా నా వంట్లో ఓపిక లేదు. మనిషిని మరీ అర్భనాకారిని కాదు కనుక మనుష్యాకృతిలో లోపం లేదు.

రక్షకభటులలో కొందరికి దెబ్బలు తగిలినవి. ఒకడికి రాయి నెమరకణతను తగిలి చచ్చాడు. ఆ రాయి చుట్టుప్రక్కల వాడెవడు విసిరాడో నాకు తెలియదు.

పైగా చంపడంలో యిన్ని భేదాలేమిటి? రాయి తగిలితే చచ్చి, తుపాకి గుండు తగిలితే బ్రతుకుతాడా? తుపాకి గుండు తగిలి చస్తే శిక్ష లేదూ! రాయి తగిలి చస్తే శిక్షా?

ఆ కళ్ళు లేని దేవుడు ఆ రాయి నేనే విసిరానన్నాడు. రాయి విసరటం మాటా అట్లా ఉంచండి. నేను చేయి యెత్తగలిగితే చాలు! ఆ స్థితిలో ఉన్నాను.

రక్షకభటులు తరిమారు. అందరూ పారిపోతున్నారు. నేను పారిపోతున్నాను. పరిగెత్తేందుకు నాకు ఓపిక యేది? వెనుక నుంచి నా నెత్తిమీద పెద్ద దెబ్బ పడ్డట్టుగా మాత్రమే నాకు తెలుసు.

ఒక రాత్రివేళ నాకు మెలకువ వచ్చింది. గాఢాంధకారంలో కూర్చుని ఉన్నా, మరునాటి ప్రొద్దుటికి తెలిసింది నాకు అది ఖైదని.

ఒకటి రెండు పూటలైన తర్వాత నాకు అన్నం పెట్టారు. అన్నం చూస్తే నా ప్రాణాలు లేచి వచ్చినవి. వెంటనే పిల్లలు జ్ఞాపకం వచ్చారు. వాళ్ళకు పెడదామని అన్నం అట్టే పెట్టాను. మరునాటికి తెలిసింది. యింక వాళ్ళు నా దగ్గరకు రారని.

వాళ్ళేమైనారో?! ఏమైనారో యెవడికి కావాలి?

పూట పూటా అన్నం తినటం నాకూ అలవాటైంది.

నాపని రాజభోగంగా ఉంది. రెండుపూటలా తిండి. ఎక్కడికైనా తీసుకొని వెళితే మోటారు కారులో తీసుకొని వెళ్ళారు. పెద్ద కోర్టులో కూడా నాకోసం ఒక ప్రత్యేక స్థానం. చివరిరోజుల్లో నాకు దశ యెత్తుకొంది. ఆ పాడుదేవుడు ఈ మాత్రంగా ఆ వెనుక కూడా సాగిస్తే యెంత బాగుండేది?

ఇంతకన్న యేమి చెప్పను? నాకు ఇంత ఉపకారం చేసిన మీరు వెయ్యేళ్ళు బ్రతకండి. బ్రతుకంతా తిండిలేక చచ్చిన నాకు రెండు నెలలు సుఖంగా తిండిపెట్టారు. మీ కడుపులు చల్లగా ఉండాలి.

కాని నాయింటిదీ, పిల్లలు ఏమైనారో తెలియలేదు. నాకు ఒక్కటే చింతగా ఉంది. నా పిల్లలు కొంచెం పెద్దవాళ్ళు అయితే ఎల్లాగో అల్లాగా పెద్దవాళ్ళు అయితే చివరి రోజుల్లో వాళ్ళకు గూడా నాకు పట్టిన యోగం పడుతుందా అని

అదంతా మీ దయ. వాళ్ళని వెదికించి యీ ఉపకారం చేయిస్తే మీ కడుపున పుడతాను.